క్లుప్తంగా

అధ్యాపకులను నియమించాలి

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని డైట్, బీఈడీ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని డీవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ పట్టణంలోని డైట్, బీఈడీ కళాశాలను మహేష్ సందర్శించి మాట్లాడారు. ఆయన వెంట కార్తీక్, గుండాల నరేష్, హనుమంతు, రాము, గణేశ్, శివ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఏఈగా నరేందర్‌రెడ్డి


నరేందర్‌రెడ్డి

మునుగోడు: విద్యుత్ శాఖ మునుగోడు మండల ఏఈగా నరేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సురేష్ నల్లగొండకు బదిలీ అయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలలో పనిచేస్తున్న నరేందర్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

నేడు గ్రామ సభ

నాంపల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నేడు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గంజి వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో జరుగుతున్న పనులు, సమస్యలు, ఉపాధిహామీ పనులపై సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

' బీజేపీ విధానాల వల్లే యూరియా కొరత '

శాలిగౌరారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కక్ష పూరిత విధానాల వల్లనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని యూత్ కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపినాథ్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి రావాల్సిన 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించకుండా కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే కేటాయించి కక్షసాధింపు చర్యలకు కేంద్రం పాల్పడుతోందన్నారు.

నేడు మొబైల్ షాపులు బంద్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో గురువారం మొబైల్ షాపులు బంద్ చేయాలని నల్లగొండ పట్టణ మొబైల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. నరేందర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. తెలంగాణలో మార్వాడీ వ్యాపారుల ఆధిపత్యాన్ని నిరసిస్తూ ఓయూ జేఏసీ పిలుపు మేరకు నల్లగొండ పట్టణంలోని అన్ని మొబైల్ షాపులు బంద్ పాటించనున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ షాపుల యజమానులు బంద్‌కు సహకరించి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థికి అస్వస్థత

నాంపల్లి : మండల కేంద్రంలోని ఓ కిరాణం దుకాణంలో కొనుగోలు చేసిన గడువు ముగిసిన కుర్‌కురే ప్యాకెట్ తిని ఓ విద్యార్థి గురువారం సాయంత్రం ట్యూషన్‌లో వాంతులు చేసుకున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం రావడంతో భయందోళన చెందారు. విద్యార్థిని వెంటనే స్థానిక హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ సైదులు

నల్లగొండ : పట్టణానికి చెందిన ఒక మహిళా ఉద్యోగి ఆటోలో ప్రయాణిస్తూ తన విలువైన మొబైల్ ఫోన్‌ను బకరం నరసింహకు చెందిన ఆటోలో మరిచిపోయింది. డ్రైవర్ నరసింహ ఆ సెల్‌ఫోన్‌ను నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సైదులుకు అందించి నిజాయితీ చాటుకున్నారు. సిబ్బందితో విచారణ చేయించి మహిళా ఉద్యోగి కరుణను పిలిపించి ఆ మొబైల్ ఫోన్‌ను ఎస్ఐ అప్పగించారు. ఆటో డ్రైవర్ బకరం నరసింహను ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది అభినందించారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

గట్టుప్పల్ : గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలని మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్ అన్నారు. ఎంపీడీఓ మాధవరెడ్డితో కలిసి స్థానిక హెల్త్ సబ్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఫర్టిలైజర్ షాపు, నామాపురం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రాజశేఖర్

మర్రిగూడ సీహెచ్‌సీకి మహర్దశ!

- 50 పడకలుగా మారనున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్
- నివేదిక పంపిన వైద్యులు
- రోగులకు అందనున్న మెరుగైన సేవలు

మర్రిగూడ : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రూపురేఖలు మారనున్నాయి. ఈ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని వైద్య విధాన పరిషత్‌కు జిల్లా వైద్యాధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. దీంతో ఇప్పటివరకు 30 పడకల ఆస్పత్రిగా ఉన్న ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం ఇక 50 పడకల ఆస్పత్రిగా మారనుంది.

అధిక సంఖ్యలో వస్తున్న రోగులు..

మర్రిగూడలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను 2023 జనవరి 3న అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో రోగులకు అన్ని రకాల వైద్యసేవలు అందుతుండడంతో మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల రోగులతోపాటు, ఇతర మండలాల నుంచి రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో ఈ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చితే మరింత మేలు జరుగుతుందని భావించిన జిల్లా అధికారులు.. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ఇటీవల నివేదిక అందజేసినట్లు స్థానిక వైద్యులు తెలిపారు.


మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్

ప్రస్తుతం ఉన్న సిబ్బంది..

ప్రస్తుతం మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఐదుగురు డాక్టర్లు, నలుగురు హెడ్ నర్సులు, పది మంది స్టాఫ్‌నర్సులు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, 12 మంది కాంటిజెన్సి వర్కర్లు ఉన్నారు. మంగళవారం ఆరోగ్య మహిళ, శుక్రవారం గర్భిణులకు ప్రత్యేక సేవలు కూడా ఆస్పత్రిలో అందిస్తున్నారు. దీంతోపాటు ప్రతిరోజూ ఓపీ సేవలు అందిస్తున్నారు.

తప్పనున్న దూరభారం

ప్రస్తుతం ప్రతిరోజూ ఓపీ సంఖ్య సాధారణంగా 250 నుంచి 350 వరకు ఉంటోంది. ఇటీవల 400కు పైగా పెరుగుతుండడంతో ఈ 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తే ఇక్కడే అన్ని రకాల సర్జరీలు చేసేందుకు వీలవుతుంది. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో 60 నుంచి 70కి.మీ దూరంలో ఉన్న నల్లగొండ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తప్పుతాయి.

దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయి



మర్రిగూడ సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మారితే స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల వారికి కూడా మెరుగైన వైద్య సేవలు అందుతాయి. అత్యవసర ప్రాణాపాయ పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయి.

– పల్లె మల్లేష్, మర్రిగూడ

నివేదిక సమర్పించాం



మర్రిగూడ 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చాల్సిన అవసరం ఉందని జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. త్వరలో జీఓ జారీ చేస్తే మరింత సిబ్బంది, పరికరాలు పెరిగి ఎక్కువ సేవలు అందించేందుకు వీలుంటుంది.

– శంకర్‌నాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

నా రాజీనామాతోనే గట్టుప్పల్ మండలం ఏర్పాటు

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల్ : 'నా రాజీనామాతోనే గట్టుప్పల్ మండలం ఏర్పాటు అయింది తప్ప.. అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడితే గట్టుప్పల్ మండలం ఏర్పాటు కాలేదు' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం గట్టుప్పల్ మండల కేంద్రంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18 నెలలు ఎమ్మెల్యే పదవి ఉన్నా.. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం తాను రాజీనామా చేశానన్నారు. తాను కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినా.. తనకు అన్యాయం జరిగినా.. మునుగోడు నియోజకవర్గానికి నిధులు తెచ్చే విషయంలో కొట్లాడతానన్నారు. ప్రతి మండలంలో మొదటి విడతగా ఏడు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. ఇడెం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సీఐ ఆదిరెడ్డి, తహసీల్దారు రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, కర్నాటి శ్రీనివాస్, రావుల రమేష్, శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలని వినతి

నాంపల్లి : అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేసి నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు రప్పించాలని కోరుతూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓ మల్లికార్జున్‌రావుకు, కాంప్లెక్స్ హెచ్‌ఎం అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామ పాఠశాలలో పని చేయకుండా వేరే మండలం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయురాలి జీతం నిలిపి వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటం వెంకటయ్య, బెల్లంకొండ నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు కాటం భిక్షం, శంకర్, శ్రీశైలం, గణేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీదేవి

చండూరు : శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని చండూరు ఆర్డీఓ వందనపు శ్రీదేవి అధికారులకు సూచించారు. గురువారం చండూరు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చండూరు రెవెన్యూ పరిధిలోని మండలాల రెవెన్యూ, పోలీస్, విద్యుత్ పంచాయతీరాజ్ అధికారులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక చవితి పండుగ రోజు నుంచి నిమజ్జనం వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షణ చేయాలని పోలీసులకు సూచించారు. విద్యుత్ అధికారులు మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, వాటి భద్రతపై పర్యవేక్షణ చేయాలన్నారు. పంచాయతీ అధికారులు శానిటేషన్ బాధ్యతలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

కట్టంగూర్ : లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. గురువారం మండలంలోని చెర్వుఅన్నారం ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ డైమండ్ నల్లగొండ సహకారంతో మాజీ ఎంఈఓ బీరం మోహన్‌రెడ్డి నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లు అందజేశారు. క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటారు. అదేవిధంగా యువ వికాసం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమలో లయన్స్ క్లబ్ డైమండ్ ప్రధాన కార్యదర్శి జానకిరెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అశోక్‌రెడ్డి, హెచ్‌ఎంలు కందాల రమ, గణపురం భీమయ్య, ఉపాధ్యాయులు సట్టు గోపి, పోశం సైదులు, రవి, శేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.


ఫ్యాన్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

దివ్యాంగ విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు


వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రామగిరి(నల్లగొండ): ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థులకు నల్లగొండ భవిత్ కేంద్రంలో గురువారం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(అలింకో), సర్వ శిక్ష అభియాన్‌సంయుక్తంగా నల్లగొండ డివిజన్ పరిధిలోని ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ శారీరక సమస్యలు ఉన్న 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగినవారు హాజరుకాగా వారికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, ఎంఈఓ కె.అరుంధతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. రవీందర్, సంస్థ సభ్యులు ప్రియవర్మ, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరు గ్రామాల రైతుల మధ్య ఘర్షణ

మునుగోడు: ప్రభుత్వ భూమిపై ఇరు గ్రామాల రైతుల మధ్య ఘర్షణ జరిగింది. ఆ భూమి తమదంటే తమదని వాగ్వాదానికి దిగారు. దీంతో విచారణకు వెళ్లిన అధికారులు చేసేదేం లేక తిరిగి వచ్చారు. వివరాలు.. మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో జిల్లాయిపేట చెరువు అనుకుని ఉన్న సర్వే నంబర్ 523లో 500 ఎకరాల ప్రభుత్వ భూమి. అందులో 200 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. మిగిలిన 300 ఎకరాల భూమిని 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు పంపిణీ చేశారు. అందులో కొంత మంది మాత్రమే సాగుచేసుకున్నారు. సాగుకు అనువైనది కాకపోవడంతో చాలామంది ఆభూమిని సాగు చేయకుండా వదిలేశారు. ప్రభుత్వ భూమి కొరటికల్ గ్రామ శివారులో ఉండగా.. అవతలి వైపు చండూరు మండలం ఉడుతలపల్లి, శిర్దేపల్లి గ్రామ శివార్లు ఉన్నాయి. ఖాళీగా ఉన్న భూమి తమదని అందులో పంటలు సాగు చేసుకుంటున్నామని ఇటీవల భూ భారతి సదస్సుల్లో కొరటికల్ గ్రామ రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను మునుగోడు మండల గిర్దావర్‌తో పాటు సిబ్బంది వెళ్లి మూడు రోజులుగా పరిశీలిస్తున్నారు. విషయం తెలిసిన శిర్దేపల్లి, ఉడుతలపల్లి గ్రామాల రైతులు ఆ భూముల్లో తాము కబ్జాలో ఉన్నామని, దరఖాస్తులు పెట్టుకున్నవారు లేరని అధికారులకు చెప్పడంతో ఇరు గ్రామాల రైతుల మధ్య గురువారం పెద్ద ఎత్తున తగువు జరిగింది. దీంతో విచారణకు వెళ్లిన అధికారులు చేసేది ఏమీలేక తిరిగి వచ్చారు. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తిప్పర్తి : మండలంలోని కంకణాలపల్లి, తిప్పర్తి, కాశివారిగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారుల జాబితా ఎల్3 వచ్చిందని, వాటిని పరిశీలించి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వేగవంతంగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సుధాకర్, హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు ఉన్నారు.

నానో యూరియా వాడాలి

చిట్యాల: రైతులు ప్రస్తుత వ్యవసాయ అవసరాలకు ఘన రూపంలోని యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించుకోవాలని చిట్యాల మండల వ్యవసాయాధికారి పి.గిరిబాబు సూచించారు. చిట్యాల పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ షాపుల వద్ద గురువారం ఆయన రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తుందన్నారు. ప్రస్తుతం అన్ని ఫర్టిలైజర్ షాపులో నానో యూరియా లభ్యమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, దుకాణదారులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: ఇటీవల రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు బందారు మహేశ్ కుటుంబానికి విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ గురువారం రూ.35 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మహేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. అదేవిధంగా మహేశ్ కుటుంబానికి రామగిరికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కబడ్డీ క్రీడాకారుడు నిమ్మల మధు రూ.20 వేలు అందజేశారు. మహేశ్ చిన్నాటి స్నేహితులు పలువురు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూతాటి సోమయ్య, వడ్లకొండ పరమేశ్, నిమ్మల సురేశ్, చిరబోయిన రమేశ్, జీడికల్లు. శంకర్, పరమేశ్, ధనుంజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న విజయ్‌కుమార్

ఘనంగా బోనాల వేడుకలు


చిట్యాల: ఎలికట్టె గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


నకిరేకల్ : పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

చిట్యాల: మండలంలోని ఎలికట్టె, వెలిమినేడు, నేరడ గ్రామాలతోపాటు చిట్యాల మున్సిపాలిటీలో శ్రావణమాసం బోనాల పండుగను గురువారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పసుపు, కుంకుమలు, వేపమండలతో అలంకరించిన బోనాలను డప్పుచప్పుళ్లతో మహిళలు, యువతులు గ్రామ శివారులోని ముత్యాలమ్మ ఆలయాల్లో సమర్పించి, మొక్కులు మొక్కున్నారు.

మడేలయ్య బోనాలు

గట్టుప్పల్ : మండల కేంద్రంలో రజకులు గురువారం మడేలయ్య బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండు యాదగిరి రెడ్డి, నామని జగన్నాథం, సామల యాదయ్య, భీమగాని మల్లేశం, రావుల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : శ్రావణమాసం సందర్భంగా నాంపల్లి మండల కేంద్రంపాటు మండలంలోని వడ్డెపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ్యా స్వామి బోనాలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. డప్పువాయిద్యాలు, యువకులు నృత్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ ఊరేగింపు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా నాంపల్లి మండల కేంద్రంలోని హరిజనవాడలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు తీశారు. ఈ వేడుకల్లో వట్టికోటి యాదయ్య, నర్సింహ, అంజి, సత్తయ్య, నాంపల్లి శ్రీనివాసులు, మారయ్య, వెంకటయ్య, చంద్రమౌళి, సైదులు, గాదెపాక రమేష్, రాములు, శ్రీకాంత్, సురేందర్, యాదయ్య, మధు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని నెమ్మాని గ్రామంలో ముత్యాలమ్మ బోనాల పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. మహిళలు ఆల యం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం, పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు.

ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నకిరేకల్ : ముత్యాలమ్మ తల్లి ఆలయంలో బోనాల ముగింపు సందర్భంగా అమ్మ వారి నెలవారం పండుగను గురువారం నకిరేకల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ రంజిత్‌కుమార్, ఆలయ చైర్మన్ పన్నాల రాఘవరెడ్డి, గౌడ సంఘం మాజీ చైర్మన్ కొండ జానయ్యగౌడ్, చేనేత సంఘం చైర్మన్ చిలుకూరి లక్ష్మీనర్సయ్య, కౌన్సిలర్లు చౌగోని రాములమ్మ సైదులు, గాజుల సుకన్య, యాసారపు లక్ష్మీ వెంకన్న, పోతులు సునిత రవీందర్, రాచకొండ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామం వీడినా.. గ్రామ దేవతకు బోనాలు

మర్రిగూడ : ఆ గ్రామం శివన్నగూడెం రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైంది. గ్రామస్తులంతా గ్రామాన్ని వీడి ఇతర గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. శ్రావణమాసం సందర్భంగా తమ గ్రామ దేవత ముత్యాలమ్మకు బోనాలు సమర్పించాలని వారు సంకల్పించారు. నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు రిజర్వాయర్‌లో మునిగిపోతున్న అమ్మవారి ఆలయం వద్దకు గురువారం వచ్చి బోనాలను సమర్పించారు. తమకు ఓ గ్రామం ఏర్పడి ముత్యాలమ్మ అమ్మవారిని నిలుపుకునేవరకు తమ గ్రామ అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా రాంరెడ్డిపల్లితోపాటు పలు గ్రామాల్లోని మహిళలు బోనాలను తీసుకెళ్లి ముత్యాలమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భీమనగాని యాదయ్య, ఐతగోని వెంకటయ్య, బోయపల్లి శ్రీనివాస్, కుక్కల వెంకటేష్, అలివేలు, కందికంటి శేఖర్‌గౌడ్, నాగమ్మ, ఐతగోని రమేష్, రమేష్, స్వప్న, మాదగోని శంకర్, పార్వతమ్మ, మహేష్‌గౌడ్, వెంకమ్మ, వెంకటయ్య గౌడ్, యాదమ్మ, సైదులు, సురేష్, పాండు, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


మర్రిగూడెం : నర్సిరెడ్డిగూడెంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


గట్టుప్పల్ మండల కేంద్రంలో..


నార్కట్‌పల్లి : నెమ్మాని గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆర్డీఓ కార్యాలయంలో వన మహోత్సవం

నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. శాలిగౌరారం తహసీల్దార్ జమీరుద్దీన్, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పెరిక మధు, సతీష్, లక్ష్మణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు

అరుదైన శస్త్ర చికిత్స

నల్లగొండ టౌన్ : డ్యూడెనల్ ఫర్ఫోరేషన్ వ్యాధితో బాధపడుతున్న రోగికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడినట్లు మలక్‌పేట యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి గ్యాస్ట్రిక్ ఎంటిరాలజిస్టు డాక్టర్ వెంకటేశ్ శ్రీపతి మాట్లాడారు. మర్రిగూడ మండలానికి చెందిన బుర్ర రంజిత్ కడుపు ఉబ్బరం, జ్వరం, విరేచనాలతో బాధపడుతూ నల్లగొండ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాడు. అయినప్పటికీ ఎలాంటి ఉపశమనం లేకపోగా కడుపునొప్పి తీవ్రం కావడంతో మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చేరాడు. ఆయనకు స్కానింగ్ చేసి కడుపులో పేగుకు రంధ్రం ఏర్పడినట్లు గుర్తించామన్నారు. వెంటనే శస్త్ర చికిత్స నిర్వహించి రోగి ప్రాణాలు కాపాడామన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఎ.వాసుకిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి సారె, ఒడిబియ్యం సమర్పణ


ఒడి బియ్యంతో మహిళలు

నకిరేకల్ : మన అమ్మ మన సారె ఒడి బియ్యం కార్యక్రమాన్ని నకిరేకల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. నకిరేకల్‌లోని పోనుగోటి శ్రీనివాస్ రావు లక్ష్మీ దంపతుల ఇంటిని నుంచి అమ్మ ఒడి బియ్యం, పసుపు, కుంకుమలతో అర్వపల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకల్లో నకిరేకల్ కనకదుర్గ ఆలయ చైర్‌పర్సన్ బ్రహ్మదేవర పద్మావతి, మన అమ్మ మనసారే కమిటీ అధ్యక్షురాలు రావిరాల కవిత, ప్రతినిధులు చల్ల రమాదేవి, మూడుదుడ్ల వెంకటలక్ష్మీ, బొబ్బలి సరిత, సూదిని మాలతి, కొండ పద్మ, అలువాల ధనమ్మ, పందాల వసంత, మూడుదుడ్ల హేమలత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి

మునుగోడు: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు శ్రమించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు శశికాంత్, దీపిక సూచించారు. మునుగోడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మునుగోడులోని కస్తూరిబా, జ్యోతిబా పూలే పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. పరీక్షలు రాసే సమయంలో భయభ్రాంతులకు గురికాకుండా తాము నేర్చుకుంది, తెలిసింది రాయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ యరమాద శ్రీనివాస్, సభ్యులు మిర్యాల వెంకన్న, పాలకూరి నర్సింహ, మిర్యాల శ్రీనివాసులు, నారబోయిన సుధాకర్, రావిరాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు

చిత్ర లేఖనంపై అవగాహన

కేతేపల్లి: సృజనాత్మక ఆలోచనతోనే కళాత్మకమైన బొమ్మలు వేయడం సాధ్యమవుతుందని ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్టూనిస్టు, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత వడ్డెపల్లి వెంకటేష్ అన్నారు. గురువారం కేతేపల్లి మండలంలోని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి సులభమైన పద్ధతిలో బొమ్మలు వేసే విధానంపై విద్యార్థులు అవగాహన కల్పించారు. ఇంగ్లిషు, తెలుగు అక్షరాలు, అంకెలతో బొమ్మలు గీసి చూపించారు. కథలు ఎలా రాయాలో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు బొమ్మలు వేయడం నేర్చుకోవడం వల్ల చక్కని చేతిరాత అలవడుతుందని, తద్వారా పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం వెంకటేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, బత్తుల జానకిరెడ్డి, జి.రమేష్, కన్నె శివయ్య, డి.నాగయ్య, జూనియర్ అసిస్టెంట్ సుమన్, అహ్మద్ పాల్గొన్నారు.